
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 25 అక్టోబరు 2024



వికసిత్ భారత్ లక్ష్యం కావాలి

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



- మహిళా సాధికారతతోనే భవిష్యత్ అభివృద్ధి
- ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారతదేశం 2047 నాటికి అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి వికసిత్ భారత్ కావాలని, అదే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆకాంక్షించారు. గురువారం సూర్యాపేట జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం సమావేశ మందిరంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 2021లో జిల్లాలో 73శాతంగా ఉన్న రక్తహీనతను ఈ ఏడాదికి 21శాతానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను పూర్తి వివరాలతో సమర్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా రక్తహీనతను నివారించేందుకు ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛభారత్ అనేది కార్యక్రమం కాదని అదొక ఉద్యమమన్నారు. జిల్లాలో 475 గ్రామపంచాయతీలు బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలు ప్రకటించడం సంతోషకరమన్నారు. స్వచ్ఛభారత్‌లో అన్నివర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలోని ప్రజలను దారిద్ర్యరేఖ నుంచి పైకి తీసుకువచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులను భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో స్వయంసహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని, భవిష్యత్ అభివృద్ధి మహిళా సాధికారితపై ఆధారపడి ఉందన్నారు. మహిళల చేతుల్లో డబ్బులు ఉన్నప్పుడు ఆర్థిక సాధికారత వస్తుందన్నారు. స్వయంశక్తితో ఉపాధి కల్పించుకుని విజయాలు సాధించిన మహిళలను సమాజానికి తెలియజేయాలని, అప్పుడే ఇతరులు వారిని స్ఫూర్తి

- మిగతా 6వ పేజీలో



కలెక్టరేట్‌లోని స్టాళ్లను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సస్యశ్యామలం చేస్తాం

- పోరాటాలకు పురిటిగడ్డ సూర్యాపేట జిల్లా
- సిమెంట్ పరిశ్రమలతో పాటు రైస్‌మిల్లుల పారిశ్రామిక రంగంలోనూ ప్రగతి
- గవర్నర్‌కు జిల్లా ప్రాశస్త్యాన్ని వివరించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

యాసంగికి ముందస్తు ప్రణాళిక

- గత ఏడాది కంటే 1.36లక్షల ఎకరాలు పెరగనున్న వరిసాగు
- నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలపై పటిష్ట నిఘా
- జేడీఏ పి.శ్రవణ్‌కుమార్‌తో

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



యాసంగి సీజన్ అక్టోబరు మొదటి వారంలో ప్రారంభంకానుంది. అందుకు వ్యవసాయశాఖ ఇప్పటికే ముందస్తు ప్రణాళిక రూపొందించింది. సాగర్ ఆయకట్టులో వానాకాలం సాగు నెల రోజులు ఆలస్యం కాగా, యాసంగి సీజన్ సాగు అక్టోబరులో రెండో లేదా లేదా మూడో వారంలో ప్రారంభంకానుంది. నాన్ ఆయకట్టులో మొదటి వారంలోనే ప్రారంభం కానుంది. 2023 యాసంగిలో 4,20,523ఎకరాల్లో వరిసాగు కాగా, 2024-25 యాసంగిలో 5,56,920ఎకరాల్లో వరిసాగు కానుంది. గత ఏడాది కంటే 1,36,397ఎకరాల్లో వరిసాగు కానుంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి పి.శ్రవణ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి' ఇంట ర్వ్యూ విశేషాలు ఇలా..

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

ఆంధ్రజ్యోతి: యాసంగిలో ఎన్ని ఎకరాల్లో పంటలు సాగవుతాయి?
జేడీఏ: 2023 యాసంగిలో వరితో పాటు ఇతర పంటలు 4,44,041లక్షల ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది యాసంగిలో 5,83,620లక్షల్లో సాగవుతాయని అంచనా. అందులో వరి 5,56,920 ఎకరాలు, వేరుశనగ 21వేల ఎకరాలు, పెసర్లు 2వేల ఎకరాల్లో సాగు కానున్నాయి.
ఆం: విత్తనాల పరిస్థితి ఏంటి?
జేడీఏ: విత్తనాలకు ఇప్పటికే ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టాం. కొన్ని విత్తనాలు అందుబాటులో ఉండగా, నెలాఖరులోగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయి. వరి విత్తనాలు 1,39,230 క్వింటాళ్ల అవసరం. అందులో ఎంటీయు 1010 రకం, ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం-118, జేజీఎల్ రకాలు ఉంటాయి. మినుములు 80 క్వింటాళ్లు, పెసర్లు 160 క్వింటాళ్లు, వేరుశనగ 22,059 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేస్తాం.
ఆం: ఎరువులు ఎంత అవసరం?
జేడీఏ: వచ్చే యాసంగి సీజన్‌కు మొత్తం 1,54,531 మెట్రిక్ టన్నుల ఎరువుల కోసం ఇండెంట్ పెట్టాం. ఆరు నెలలకు సంబంధించి....

- మిగతా 8వ పేజీలో...

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

డీఎస్‌వో వెంకటేశ్వర్లు



కోయగూరవానిబావిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్లు

గుర్రంపోడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని కోయగూరవానిబావిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకార్యలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. తూకం, తేమశాతం కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీబ్యాగ్లు, ప్యాడీక్లీనర్లు కొనుగోలు కేంద్రంలో ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం కొప్పోలు, చామలేడు కొనుగోలు కేంద్రాలను తనిఖీచేసి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో మంజూల, ఏవో మాధవరెడ్డి, ఏపీవో గోపాల్‌రెడ్డి, ఏపీఎం యాదయ్య, ఇన్‌చార్జి డీటీసీఎస్ రావుల సైదులుగౌడ్, తదితరులు ఉన్నారు.

ఆ మేడం రూటే సప'రేటు'



- తహసీల్దార్ కార్యాలంలో దళారులదే రాజ్యం
- కార్యాలయ విభాగాలపై ప్రైవేటు వ్యక్తుల పెత్తనం
- పనినిబట్టి రేట్ ఫిక్స్
- మధ్యవర్తులతో బేరసారాలు
- నేరుగా వెళ్లిన అర్జీదారులపై కస్సుబుస్సు

ఆ తహసీల్దార్ కార్యాలయంలో దళారులు రాజ్యమేలుతున్నారు. మధ్యవర్తులు చెప్పిందే వేదం అన్నట్లు అధికారులు ఫైళ్లు చక్కబెడుతుంటారు. అడిగినంత ముట్టజెపితే గంటల్లో పని, లేదంటే రోజుల తరబడి ప్రదక్షిణలు. ఏ సర్టిఫికేట్ కావాలన్నా.. భూ రిజిస్ట్రేషన్ జరగాలన్నా ముడుపులు ఇవ్వాల్సిందే. కార్యాలయ విభాగాలపై పర్యవేక్షణ జరిపి అక్రమాలకు తావివ్వకుండా చూడాల్సిన ఉన్నతాధికారే ముడుపులకు అలవాటు తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. సొంత శాఖకు మచ్చతెచ్చేలా ఆ అధికారి తీరుతో కిందిస్థాయి ఉద్యోగులు నలిగిపోతున్నారు. రెవెన్యూ డివిజన్ కార్యాయానికి కూతవేటు దూరంలో కోదాడ-జడ్చర్ల రహదారిపై ఉన్న ఓ రెవెన్యూ కార్యాలయంలో నిత్యం జరుతున్న తంతు ఇదీ.

- మిర్యాలగూడ అర్బన్

ఎన్నికల బదిలీల్లో భాగంగా పదోన్నతిపై ఏడాది క్రితం ఇక్కడికి వచ్చిన అధికారి అనతికాలంలోనే అక్రమార్జనకు మార్గం సుగమమం చేసుకున్నారు. నిత్యం కార్యాలయాని కి వచ్చే ఒకరిద్దరు దళారులతో చేతులు కలిపి మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 32 గ్రామపంచాయతీలున్న ఈ మండలంలో వ్యవసాయ భూము ల క్రయ, విక్రయాలు ఒక రీతిగా సాగుతున్నాయి. జాతీయ రహదారి ఏర్పాటుతో స్థిరాస్తి వ్యాపారులు ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ భూరిజిస్ట్రేన్లు పుంజుకున్నాయి. నిత్యం సగటున 10 నుంచి 15 వరకు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. అయితే బ్యాంకులో రుణం తీసుకొని, అవసరం కొద్దీ చిన్న, సన్నకారు రైతులు భూమి విక్రయించుకుంటే రిజిస్ట్రేషన్‌కు తిప్పలు పెడుతున్నారు. ఒక్కో రిజిస్ట్రేన్‌కు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దళారుల మితిమీరిన పెత్తనంతో దిగువ శ్రేణి ఉద్యోలు ఇబ్బందిపడుతున్నారు. ఆ అధికారి నియమించుకున్న ప్రైవేట్ వ్యక్తులు ఫైల్‌పై ఓ గుర్తు పెడతారట. అది చూసిన మేడానికి దాని విలువెంతో తెలిసి ఫైల్ క్లియర్ చేస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పొరకుల కూపీ

పనికో రేటు

కార్యాలయంలో పనికోరేటు ఫిక్స్ చేసినట్టు ప్రచారంలో ఉంది. ధరణి పోర్టల్‌లో చేర్పులు, మార్పులు జరగాలంటే రూ.2వేల నుంచి రూ.5వేల వరకు అప్పజెప్పాల్సి వస్తోంది. మిస్సింగ్ సర్వేనెంబర్ల గుర్తింపు, డిజిటల్ సిగ్నేచర్‌కు సైతం ధరణి సెక్షన్‌లో మామూళ్లు తీసుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం చేసుకున్న దరఖాస్తులపై విచారణ జరిపేందుకు అధికారి వెళ్లాలంటే ముందుగా ఉన్నతాధికారి అనుమతి తీసుకోవాల్సిందే. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీచేయాలంటే వేల రూపాయలు చెల్లించుకోవాల్సి వస్తోందని మండల వాసులు వాపోతున్నారు. డీఆర్‌లో అర్జీదారుల వివరాలు నమోదు చేయకుండానే పత్రాలు జారీ చేసి అక్రమాలు బయట పడకుండా జాగ్రత్త పడుతున్నట్టు సమాచారం.

అర్జీదారులపై ఆగ్రహం

ప్రజలు అవసరం నిమిత్తం దరఖాస్తు చేసుకుంటే ధ్రువపత్రాల జారీలో జాప్యం జరుగుతోంది. ఇదేంటని మేడం వద్దకు వెళ్తే ఎవరు పంపారంటూ శివాలెత్తిపోయి ఫిర్యాదులను విసిరికొట్టి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు ఆమె ఛాంబర్‌లోకి వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. అదే తాను నియమించుకున్న ప్రైవేటు వ్యక్తులను తోడ్కొని వెళ్తే సమాధానం లభిస్తోందన్న ప్రచారం

- మిగతా 8వ పేజీలో...



బండిపై పహాణీలను బయటికి తీసుకెళ్తున్న ప్రైవేట్ వ్యక్తి

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి



చందుపట్ల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

నకిరేకల్,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో బి.భిక్షపతి అన్నారు. గురువారం మండల పరిధిలోని చందుపట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఆయన తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపాలన్నారు. ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య అందించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా బోధన చేయాలని, వచ్చే విద్యాసంవత్సరం నాటికి విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. మెనూ ప్రకారం రుచికర భోజనాన్ని అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.నాగయ్య, హెచ్ఎం నర్సింహ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హాలియా, అక్టోబరు 24: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. గురువారం హాలియాలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే పేద, మధ్య తరతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలకు భవనాలు నిర్మించాలని, రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే గత ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికీ పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, చందు, సాయి, వర్షిత్, నాగరాజు, అనిల్, మనోజ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నల్లగొండ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుక వచ్చిన విద్యా విధానంతో ఎన్నో నష్టాలు ఉన్నాయని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉందన్నారు. మూడు, నాలుగు యూనివర్సిటీలను విభజించడం సరైనది కాదన్నారు. విద్యను కార్పొరేట్, కాషాయీకరణ చేయాలని కేంద్రం చూస్తోందన్నారు. నూతన విద్యావిధానంతో ప్రాథమిక విద్య నిలిచిపోయే పరిస్థితి ఉంటుందన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్ మాట్లాడుతూ, నూతన విద్యావిధానంతో పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళికృష్ణ, శోభన్‌బాబు, సూర్యతేజ, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

పనితీరును మెరుగుపరుచుకోవాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



నల్లగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎంలు, పీహెచ్‌సీల ఎంవోలు వారి పనితీరును మెరుగుపరుచుకోవాలని, లేదంటే శాఖపర చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో నల్లగొండ డివిజన్‌కు సంబంధించి జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలపై ఉద్యోగులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. వచ్చే సమావేశం నాటికి పనితీరులో మార్పు కనిపించాలని, లేదంటే చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో, మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ట్రైనీ అధికారులు

కొండమల్లేపల్లి, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన ఉండాలని డీఆర్డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం యూనియన్ సర్వీస్ ట్రైనీ అధికారులతో కలిసి మండలంలోని పెండ్లిపాకల పరిసర గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి పథకాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. సీజన్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజురెడ్డి, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో రాంచంద్రు నాయక్, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



తాళ్లగడ్డ శివారులో నేలవాలిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, మాడ్గులపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతీ రైతుకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకుంటుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లగడ్డ, ఎరుకులగుట్ట, మాడ్గులపల్లి మండలంలోని పోరెడ్డి గూడెం, చిరుమర్తి, పాములపాడు గ్రామాల్లో అకాల వర్షాలకు నేలవాలిన పంట పొలాలను గురువారం వ్యవసాయాధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నేలవాలిన పంట పొలాలను వీడియోకాల్ ద్వారా కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లారు. నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ప్రతీ గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే రూ.2లక్షల రుణమాఫీ చేసిందని, నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని, వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, నాయకులు పిల్లల సందీప్, ఏడీఏ దేవ్‌సింగ్, మాడ్గులపల్లి ఏవో శివరాంకుమార్, రైతులు పాల్గొన్నారు.



సాగర్‌లో 'పవర్ ఫుల్'

- ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ముమ్మరంగా విద్యుదుత్పత్తి
- ఈ ఏడాది లక్ష్యం 1400 మిలియన్ యూనిట్లు


7

కేతేపల్లి యువ రైతుకు జాతీయ ఉత్తమ రైతు పురస్కారం

- ప్రకటించిన ఐసీఏఆర్‌ఏ

7

● వాహ్‌రధి..



సూర్యాపేట జిల్లా కేంద్రానికి సమీపంలో మూసీ నదిపై నిర్మించిన ఒకప్పటి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారికి వారధి ఇది. హైవే విస్తరణలో భాగంగా నిర్మించిన నూతన బ్రిడ్జి మీది నుంచి వెళ్తున్న ప్రయాణికులను పచ్చనిపొలాలతో వారధి ఆకట్టుకుంటోంది. అక్కడ ఆగుతూ ప్రయాణికులు ఫొటోలు దిగుతున్నారు. సెల్ఫీలతో సందడి చేస్తున్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు


ఆలయంలో నిత్య కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణ తంతు నిర్వహించారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.12,52,664 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.



మడిలో వడివడిగా...

ప్రకృతి కన్నెర్రతో దెబ్బతిన్న పొలాలను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పరిశీలించారు. గురువారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం పోరెడ్డిగూడెం, చిరుమర్తి, పాములపాడు గ్రామాల్లోని ఆయన పర్యటించారు. బాధితుల రైతుల వెంట పొలాల్లో నడుస్తూ వారి భుజంపై చేయి వేసి ధైర్యం చెబుతూ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఏవో శివరాంకుమార్ ఉన్నారు.
(ఆంధ్రజ్యోతి-మాడ్గులపల్లి)

బ్యాడ్మింటన్ బంగారాలు



● క్రీడల్లో రాణిస్తున్న మిర్యాలగూడకు చెందిన రాధశ్రీ, జయశ్రీ
● రాష్ట్ర, జాతీయస్థాయి పతకాలు

ఈ అక్కాచెల్లెళ్లు బ్యాడ్మింటన్ రాకెట్ పట్టారంటే ప్రత్యర్థులు బెదిరిపోతారు. బరిలోకి దిగారంటే పతకం వచ్చే వరకూ విశ్రమించరు. సాధారణ కుటుంబంలో జన్మించిన రాధశ్రీ, జయశ్రీ బ్యాడ్మింటన్‌లో సూపర్ సిస్టర్స్‌గా పేరు తెచ్చుకుంటున్నారు. సింగిల్స్ అయినా డబుల్స్ అయినా అదరగొట్టాల్సిందే. ప్రత్యేక శిక్షణతో రాటుదేలిన ఇరువురు సిస్టర్స్ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ క్రీడాభిమానుల మన్ననలు పొందుతున్నారు ఈ అక్కాచెల్లెళ్లు.
(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)



ప్రోత్సాహమిస్తే మరింత రాణిస్తా

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ సాధన చేయడం కష్టంగా ఉంది. పోటీపరీక్షలకు సిద్ధమవుతూనే సాధన చేస్తున్నా. దాతలు సహకారం అందించాలి. ఏ ఇబ్బంది లేకుండా ఉంటే మరింతగా రాణిస్తా. కోచ్ ప్రోత్సాహమే ఇప్పటివరకు ఆడించింది. ఉచిత శిక్షణతో వెన్నుతట్టడం ఆయన గొప్పతనం.

\- రాధశ్రీ, క్రీడాకారిణి

ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం రాజుపేట గ్రామానికి చెందిన మిట్టకోలు ఉపేందర్-సుజాత దంపతులు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి వలస వచ్చారు. కుమార్తెలు రాధశ్రీ, జయశ్రీలకు బ్యాడ్మింటన్ క్రీడపై ఉన్న అమితాసక్తిని గుర్తించి వేసవి ఉచిత శిక్షణ శిబిరంలో చేర్పించాడు. క్రీడాసాధనపై పట్టుదల, ఏకాగ్రత చూపించిన ఇరువురికి డీఎస్ఏ కోచ్ మారబోయిన రామకృష్ణ ప్రత్యేక శిక్షణనిచ్చాడు. నాటి నుంచి ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ముందుకు సాగుతున్నారు. రాధశ్రీ డిగ్రీ పూర్తి చేయగా, జయశ్రీ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదవుతోంది.



రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ..

బ్యాడ్మింటన్ సిస్టర్స్ రాధశ్రీ, జయశ్రీలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ తోటి క్రీడాకారులకు సవాల్ విసురుతున్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో తమదైన ప్రతిభ కనబరుస్తూ పతకాల పంట పండిస్తున్నారు. అండర్-13, అండర్-15, అండర్-17, అండర్-19, ఖేల్ ఇండియా, విభాగాల్లో సత్తాచాటిన వీరిద్దరూ మూడేళ్ల పాటు జిల్లా ఛాంపియన్లుగా ఉన్నారు. రాధశ్రీ జిల్లా స్థాయిలో ఐదు బంగారు పతకాలు, రెండు వెండి, మరో కాంస్య పతకం సాధించింది. ఇక జయశ్రీ ఎనిమిది బంగారు,కాంస్య పతకాలు సాధించి రికార్డు సృష్టించింది. మరో ఐదు వెండి పతకాలతో పాటు పలు విభాగాల్లో మెడల్స్ సాధించింది.



దేశం తరపున ఆడాలని

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నా. దేశం తరుపున ఆడాలని ఉంది. పట్టుదలతో అకాడమీకి ఎంపికైనా ఆర్థిక ఇబ్బందుల కారణంగా వెళ్లలేకపోయా. అమ్మ, నాన్న, కోచ్ వల్లే ఈ స్థాయికి వచ్చా.

జయశ్రీ, క్రీడాకారిణి

నౌకా దళ క్విజ్‌కు 'తేజ' విద్యార్థులు



కోదాడ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు నౌకా దళ క్విజ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి తెలిపారు. జాతీయస్థాయిలో భారత నావికా దళం థింక్యూ-2024 పేరిట పాఠశాల స్థాయి విద్యార్థులకు దేశవ్యాప్తంగా సెప్టెంబరులో క్విజ్ నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో 9వేల పాఠశాలలు పాల్గొనగా, మూడు దశల్లో రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించి ఫైనల్ పోటీలకు 16 పాఠశాలల జట్లను ఎంపిక చేశారన్నారు. తెలంగాణ నుంచి తమ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి నోముల సృజన్ గుప్తా, 10వ తరగతి విద్యార్థి కొంద్ర నవీన్‌కుమార్‌ల జట్టు ఎంపికయ్యారన్నారు.

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు గురుమూర్తి




మఠంపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రానికి చెందిన ములకలపల్లి గురుమూర్తి సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సతీష్ గురువారం తెలిపారు. ఈ నెల 23న నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎంజీ యూనివర్శిటీలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో నల్లగొండ ఎన్‌జీ డిగ్రీ కళాశాలలో చదువుతున్న గురుమూర్తి ప్రతిభ కనబరిచి సౌత్ జోన్ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 30న చెన్నైలోని మిల్కాసింగ్ స్టేడియంలో నిర్వహించే కబడ్డీ పోటీల్లో పాల్గొంటాడని ఆయన తెలిపారు. గురుమూర్తి సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక కావడంపై నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అభినందించారు.

ధార్మిక క్షేత్రాలకు భారత్ గౌరవ్ రైళ్లు



భువనగిరి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ధార్మికక్షేత్రాలను తక్కువ ఖర్చుతో సందర్శించేలా రైల్వే శాఖ భారత్ గౌరవ్ రైళ్లను నడుపుతున్నట్లు ఐఆర్ సీటీసీ ప్రతినిధి పవన్‌కుమార్ సెంగార్ అన్నారు. గురువారం భువనగిరి రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మగౌరవ్ రైళ్లలో ప్రయాణించే భక్తులకు ప్యాకేజీ రూపకంలో వసతి, దైవ దర్శనం, భోజనం తదితర సదుపాయాలన్ని కల్పిస్తామన్నారు. 3 ప్యాకేజీలుగా ప్రయాణాలు ఉంటాయన్నారు. జ్యోతిర్లింగాలు, దివ్య దర్శనాల కోసం నవంబరు 6 నుంచి 14 వరకు శబరిమలైకు, నవంబర్ 16 నుంచి 20 వరకు భారత్ గౌరవ్ రైళ్ల నడుపుతున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్‌లో ప్రారంభమయ్యే జ్యోతిర్లింగాల రైలు వరంగల్ మార్గంలో, శబరిమల రైలు నడికుడి మార్గంలో ప్రయాణిస్తాయని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్లు 9281030711, 9281030750కు సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐఆర్‌సీటీసీ మేనేజర్లు శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి



● ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య అల్తాఫ్‌హుస్సేన్ అన్నారు. ఎంజీయూ 31వ ఆంధ్ర, తెలంగాణ బెటాలియన్ సహకారంతో గురువారం ఇంజనీరింగ్ విద్యార్థులకు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ రాత పరీక్ష, దేహదారుఢ్య పరీక్షల ద్వారా ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువత విద్యార్థి దశ నుంచే తమను తాము మలుచుకుంటూ సమాజ నిర్మాణంలో పరిపూర్ణ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 31వ బెటాలియన్ కల్నల్ లక్ష్మారెడ్డి, రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ సుధారాణి, రేఖ, హరీష్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



హెల్మెట్ ఏదీ?

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న నలుగురు ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సూర్యాపేట జిల్లా కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్

వికసిత్ భారత్ లక్ష్యం కావాలి


సమావేశానికి హాజరైన జిల్లాలోని మునిసిపల్ చైర్‌పర్సన్లు, అధికారులు




గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు బొకే అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి


బొకే అందజేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాను సస్యశ్యామలంగా మారుస్తామని మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జిల్లాలోని నీటి పారుదల అభివృద్ధి, జిల్లా ప్రాశస్త్యాన్ని మంత్రి ఉత్తమ్ వివరించారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధిస్తున్న జిల్లా సిమెంట్ పరిశ్రమలతో పాటు రైస్‌మిల్లులతో పారిశ్రామిక రంగంలోనూ అభివృద్ధి చెందనున్నట్లు వివరించారు. చారిత్రక నేపథ్యానికి సూర్యాపేట బలమైన పునాదన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలకు అడ్డా సూర్యాపేట అని కొనియాడారు. జాగీర్‌దారులు, జమీందార్లకు వ్యతిరేకంగా ఉద్యమించిన గడ్డ సూర్యాపేట అని మంత్రి గవర్నర్‌కు వివరించారు. నైజాంకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదినది కూడా సూర్యాపేట నుంచేనని గుర్తుచేశారు. నూతనంగా ఏర్పడ్డా అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ఫలితాలు సాధిస్తోందన్నారు. చిన్నరాష్ట్రం అయినా ఆర్థికాభివృద్ధిలో సుసంపన్నంగా నిలదొక్కుకుందన్నారు. పారిశ్రామిక రంగంలో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తోందన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పారిశ్రామికవేత్తలు బారులు తీరుతున్నారని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

ఈ సీజన్ నుంచే బోనస్

ఈ సీజన్ నుంచే సన్నరకం ధాన్యానికి క్వింటాకు మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందజేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం రూ.20వేల కోట్లను వెచ్చించనుందన్నారు. సాగునీటి రంగానికి ప్రభుత్వం రూ.28వేల కోట్లను ఖర్చు చేయనుందని, ఆయా నిధులతో ప్రాజెక్టుల నిర్మాణాలు, ఆనకట్టల ఆధునికీకరణ పనులను వేగంగా చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిపారు. జనవరి నుంచి తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి సన్నబియ్యం అందించనున్నట్లు స్పష్టం చేశారు.

(5వ పేజీ తరువాయి)

తీసుకుని అభివృద్ధి చెందుతారన్నారు. జిల్లాలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. వారికి విద్యతో పాటు చేతివృత్తులకు సంబంధించిన వస్తువుల తయారీపై అవగాహన కల్పిస్తే ఇంకా విజ్ఞానవంతులు అయ్యే అవకాశం ఉంటుందన్నారు.సమాజం అంటే సంపద కాదని, సమాజం అంటే సంస్కృతి అన్నారు. ముందుగా కలెక్టరేట్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ బుర్రా వెంకటేశం, జాయింట్ సెక్రటరీ భవానీశంకర్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్‌పద్మావతిరెడ్డి, సూర్యాపేట, హుజూర్‌నగర్, తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్లు పెరుమాళ్ల అన్నపూర్ణ, అర్చన, అనసూర్య, కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.

పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలి: జగదీష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌కు విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు ఆయన పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాలకు పత్తి పంట దెబ్బతిన్నదని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి పంట సాగు చేసిన రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం అందించలేదన్నారు. పత్తి పంట విషయంలో తెలంగాణ రాష్ట్రంపట్ల కేంద్రం వివక్ష చూపుతోందన్నారు. గుజరాత్ రాష్ట్రంలో పండిన పత్తి కంటే తెలంగాణలో పండించిన పత్తి నాణ్యంగా ఉన్నా కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందన్నారు.


గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

గుజరాత్‌లో మద్దతు ధర పత్తి క్వింటాకు రూ.8,200 ఉండగా రాష్ట్రంలో మాత్రం రూ.7600 మాత్రమే చెల్లిస్తున్నారని దుయ్యబట్టారు. అకాల వర్షాలతో ఆశించిన స్థాయిలో పత్తి దిగుబడి రావడంలేదని, ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం నాలుగు క్వింటాళ్ల మాత్రమే వస్తుందన్నారు. పంటను విక్రయించేందుకు సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుచేయలేదన్నారు.దీంతో రైతులు ప్రైవేట్‌లో తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటువిషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంకా విధివిధానాలు రూపొందించకపోవడం బాధాకరమన్నారు. ధాన్యం సీఎంఆర్ విషయంలో మిల్లర్లు తమవల్ల కాదని అంటున్నారని అయినా వారితో ప్రభుత్వం మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, తూడి నర్సింహారావు, భాషా, బత్తుల ప్రసాద్ ఉన్నారు.

మిర్యాలగూడ వాసికి జాతీయ పురస్కారం


సందీప్‌కుమార్

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):సామాజిక సేవకుడు, పర్యావరణ ప్రేమికుడు అవిరెండ్ల సందీప్‌కుమార్ సర్దార్ వల్లభాయి పటేల్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు హోప్ స్వచ్ఛంద సేవా సమితి సింధుఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షుడు దైద వెంకన్న చరవాణి ద్వారా సందేశం అందినట్లు ఆయన తెలిపారు. మిర్యాలగూడ వాసిగా పట్టణ పరిసర ప్రాంత నిరుపేదలకు అన్నదానం, దుప్పట్ల పంపిణీతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడినందుకు పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. లక్ష విత్తనాలు భూమిపై చల్లి, మరో 75 వేల విత్తనాలను సేకరించారు. మిత్రుల సహకారంతో దక్కిన ఈ పురస్కారం తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని భవిష్యత్‌లో మరింతగా సమాజసేవకు పాటుపడుతానని అన్నారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో మం త్రి పొన్నం ప్రభాకర్, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నట్లు వివరిం చారు.

విత్తనోత్పత్తి క్షేత్రంలో కందుల వేలం


కందుల వేలం నిర్వహిస్తున్న అధికారులు

డిండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని విత్తనోత్పత్తి క్షేత్రంలో పండించిన కందులను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం వేలం వేశారు. 2023-24 సంవత్సరంలో డిండి, చెర్కుపల్లి విత్తనోత్పత్తి క్షేత్రంలో పండించిన 67 క్వింటాళ్ల కందులు విత్తనాలకు అనువుగా లేకపోవడంతో గురువారం వేలం వేశారు. మిర్యాలగూడకు చెందిన కె.శ్రీనివాస్ క్వింటా రూ.7,560లకు వేలంలో కందులను దక్కించుకున్నా రు. విత్తనాలకు అనువుగా లేకపోవడం వల్లనే కందులను విక్రయించినట్లు ఫాం ఏడీ నివేదిత తెలిపారు. వేలంలో ఐదుగురు ట్రేడర్స్ పాల్గొనగా శ్రీనివాస్ రూ.7,560లకు కందులను దక్కించుకున్నారు.కార్యక్రమంలో ఏడీ.శ్రీలక్ష్మి, ఏవో వెంకన్న, రామలింగేశ్వరరావు, మాధవి, పాల్గొన్నారు.

సాగర్‌లో 'పవర్ ఫుల్'



- ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ముమ్మరంగా విద్యుదుత్పత్తి
- ఈ ఏడాది లక్ష్యం 1400 మిలియన్ యూనిట్లు

నాగార్జునసాగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని మూడు నెలల్లోనే చేరుకున్నారు. రెండేళ్ల తర్వాత ఎగువ నుంచి భారీ స్థాయిలో వరద వచ్చి చేరటంతో ఈ ఏడాది సాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో జూలై 24వ తేదీన విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. ఈ ఏడాది విద్యుదుత్పత్తి లక్ష్యం 1,400 మిలియన్ యూనిట్లు కాగా మూడు నెలల్లో మంగళవారం మధ్యాహ్నం (అక్టోబరు 22వ తేదీ) నాటికి లక్ష్యాన్ని చేరుకున్నట్లు జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఒక్క రోజుకు 75 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి కాగా మొత్తం విద్యుదుత్పత్తి 1,475 మిలియన్ యూనిట్లు సీఈ తెలిపారు. గత ఏడాది సాగర్‌కు ఎగువ నుంచి వరద రాకపోవడంతో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని (1530 మిలియన్ యూనిట్లు) చేరుకోలేదు. ఈ ఏడాది ఈ ఆర్థిక సంవత్సరంలో (ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు) జూన్ మొదటి వారంలో సాగర్‌కు నీటి రాక లేక విద్యుదుత్పత్తి ప్రారంభించలేదు. జూలై 24వ తేదీ నుంచి ఎగువనుంచి సాగర్‌కు వరద రాక ప్రారంభం కావడంతో ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని జెన్‌కో అధికారులు ప్రారంభించారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉండగా ఒక్కో టర్బైన్ నుంచి 110 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. అందులో రెండో నంబరు టర్బైన్ ఏడాదిగా మరమ్మతులకు గురైంది. దీంతో ప్రస్తుతం ఏడు టర్బైన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేసినప్పటికి మూడు నెలల కాలంలో లక్ష్యాన్ని చేరుకున్నామని సీఈ తెలిపారు. రెండో నంబరు టర్బైన్ మరమ్మతు పనులు మంగళవారం ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. మరమ్మతు చేసేందుకు జపాన్ దేశం నుంచి సాంకేతిక నిపుణులు రావాల్సి ఉండగా సరైన సమయంలో వారు రాలేదు. వారం రోజుల క్రితం వారు సాగర్‌కు వచ్చారు. నిపుణుల సలహాలు, సూచనల మేరకు మరమ్మతుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రెండు నెలల సమయం పడుతుందని జపాన్ ఇంజనీర్లు తెలుపగా, 45 రోజుల్లో పూర్తి చేయాలని కోరినట్లు సీఈ తెలిపారు.



నాలుగేళ్లలో సాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ఇలా..

సంవత్సరం	లక్ష్యం(మిలియన్ యూనిట్లు)	ఉత్పత్తి (మి.యూ)
2019-20	1289	1512.85
2020-21	1290	1248.78
2021-22	1535	2262.62
2022-23	1500	2355.63
2023-24	1530	540.83
2024-25	1400	1400

(జూలై 24 నుంచి అక్టోబరు22 వరకు)

మూడు నెలల్లోనే లక్ష్యాన్ని అధిగమించాం



సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది ఉన్నతాధికారులు నిర్ణయించిన 1,400 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాం. గత ఏడాది సాగర్ ప్రాజెక్టులో సరిపడా నీరు లేకపోవడంతో కేవలం 540.83 మిలియన్ యూనిట్లు మా త్రమే విద్యుదుత్పత్తి చేశాం. ఈ ఏడాది సాగర్ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు వచ్చి చేరింది.ఏడు టర్బైన్ల ద్వారా పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తిని ప్రారంభించి మూడు నెలల్లో లక్ష్యాన్ని చేరుకున్నాం. అవసరం ఉన్నంత మేరకు విద్యుతుత్పత్తి కొనసాగుతుంది.

- మంగేష్ కుమార్, జెన్‌కో సీఈ

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.154	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.148	214	244

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	590.00
టీఎంసీలు	312.0450
ఎడమకాల్వకు నీటి విడుదల	6,173
కుడికాల్వకు	10,350
విద్యుత్ కేంద్రం ద్వారా	28,826
క్రస్ట్ గేట్ల ద్వారా	1,62,000
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	1,51,529 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	2,10,149 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	20

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.37 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	21,640
అవుట్‌ఫ్లో	16 వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

- మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.60అడుగులు
టీఎంసీలు	4.09
ఎన్ని గేట్ల ద్వారా	2 గేట్ల ద్వారా
ఇన్‌ఫ్లో	697.33 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	944.09 క్యూసెక్కులు

- కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	20 అడుగులు

- శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3750 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3750 క్యూసెక్కులు

-డిండి,(ఆంధ్రజ్యోతి)

సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఎంపీ చామల



శాలిగౌరారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ చైర్మన్‌గా చేసిన సంప్రదింపుల కమిటీలో స భ్యుడిగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కు మార్‌రెడ్డి నియమితులయ్యారు. లోక్ సభ నుంచి ఎనిమిది మంది రాజ్యసభ నుంచి నలుగురు, అలాగే ఇద్దరు ఎక్స్‌అఫిషియో సభ్యులతో మొత్తం 14 మంది సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో రాష్ట్రం నుంచి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్ రెడ్డికి చోటు కల్పించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి నియామకం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బంగారం మెరుగు పెడతామని మోసం

త్రిపురారం,అక్టోబర్24(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు బంగారం మెరుగుపెడతామని చెప్పి మహిళ వద్ద పుస్తెలతాడు తీసుకొని మెరుగు పెట్టి తక్కువ తూకంతో మోసం చేశారు. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొంగరి సునీత ఇంటి వద్ద ఉండగా గురువారం ఉదయం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి బంగారం మెరుగుపడతామని చెప్పారు. వారిని నమ్మిపుస్తెల తాడును వారికి ఇచ్చింది. అనంతరం రసాయనాల్లో ముంచి ఆమెకు తిరిగి పుస్తెలతాడు ఇచ్చి వెళ్లిపోయారు. బంగారం బరువు తక్కువగా ఉన్నట్లు ఆమెకు అనుమానం రావడంతో కాంటా వేయ గా సుమారు 6 గ్రాములు తక్కువగా ఉన్నన ట్లు తేలింది. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యా దు చేయగా కేసు నమోదు చేశారు. త్రిపురారం వద్ద సాయంత్రం వాహన తనిఖీలు చే స్తు ం డగా మోసానికి పాల్పడిన ఇద్దరు పట్టుబడినట్లు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓవర్ టేక్ చేయబోయి లారీకి ఢీకొన్న కారు..

కేతేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈఘటన మండల కేంద్రం కేతేపల్లిలో జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న కారు డ్రైవర్ కేతేపల్లి ఎస్సీకాలనీ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించాడు. ఈ క్రమంలో అదే లారీని వెనుక భాగంలో బలంగా ఢీ కొట్టడంతో అదుపు తప్పిన కారు రోడ్డుపై పల్టీలు కొట్టింది. ప్రమాదంలో కారు బెలూన్లు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జయ్యింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో వివరాలు తెలియలేదు.

'మల్బరీ సాగు లాభదాయకం'

గరిడేపల్లి, అక్టోబరు 24: ప్రత్యామ్నాయ పంటల సాగుకు మల్బరీ ఎంతో లాభదాయకంగా ఉంటుదని రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ సెరీక ల్చర్ ఎ.ముత్యాలు అన్నారు. గురువారం మండల పరిధిలోని గడ్డిపల్లి కేవీకేలో ప ట్టు రైతులకు నైపుణ్యతా శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ. ప్రత్యామ్నాయ పంటల సాగులో మల్బరీ సాగు ఎంతో లాభదాయకంగా ఉంటుదని, తద్వారా అధిక ఆదాయం పొందవచ్చున్నారు. కార్యక్రమంలో కేవీకే ఇంచార్జి, ప్రోగ్రాం డైరక్టర్ డి.నరేష్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వినోద్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ టీ.మాధురి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ రాఘవేందర్ పాల్గొన్నారు.0

తండ్రి నెల మాసికం నాడే తనయుడి మృతి

- కోనేరులో మునిగి మృత్యువాత
- సూర్యాపేట జిల్లా

ఆత్మకూరు(ఎస్)లో విషాదం


మహేష్‌చారి(ఫైల్)

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తండ్రికి నెల మాసికం నిర్వహించి కోనేరులో స్నానం చేసేందుకు వెళ్లినకుమారుడు నీటమునిగి మృతిచెందాడు. గురువారం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్)మండలం పాతసూర్యాపేటలోని చక్రయ్య గుట్టపై ఈ విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాత సూర్యాపేటకు చెందిన పోలోజు రుక్మాచారి(52)కి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు మహేష్‌చారి(22) ఉన్నారు. 15ఏళ్ల క్రితం నూతనకల్ మండలం ఎర్రపాడు గ్రామానికి బతుకు దెరువు కోసం వెళ్లిన రుక్మాచారి అక్కడే బంగారం పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కుమార్తెలకు వివాహం కాగా, కుమారుడు విద్యుత్ సంబంధ పనులు (ఎలక్ట్రీషియన్) నేర్చుకుంటున్నాడు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రుక్మాచారి స్వగ్రామ మప్టైన పాత సూర్యాపేటకు తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం రుక్మాచారి మృతి చెందాడు. గురువారం రుక్మాచారి కుమారుడు మహేష్‌చారి(22) కుటుంబ సభ్యులు బంధువులు గ్రామసమీపంలో ఉ న్న చక్రయ్య గుట్ట వద్దకు వెళ్లి నెల మాసికం క్రతువులు పూర్తి చేశారు. అనంతరం గుట్టపై ఉన్న కోనేరులో స్నానానికి దిగి ప్రమాదశాత్తు కాలుజారి నీటిలోకి జారాడు. 18 అడు గుల లోతులో ఉన్న కోనేరులో పడి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. బంధువులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకపోయింది. పరిసర ప్రాంతాల రైతులు వచ్చి రెండు గంటల పాటు కోనేరులో వెతికి మహేష్ మృతదేహాన్ని తీశారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతుడి తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు.

సూర్యాపేటలో మరో చైన్ లింక్ యాప్ మోసం

- ఆర్‌జీఏ పేరుతో కార్యాలయం ఏర్పాటు
- లక్షల్లో నష్టపోయిన నిరుపేదలు, రోజుకూలీలు



సూర్యాపేటక్రైం, అక్టోబరు 24: చైన్ లింక్ యాప్ ద్వారా అధిక డబ్బుల వస్తాయని ఆశపడి కొందరువ్యక్తులు నిలువునా మునిగారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం వెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన సంస్థగా చెబుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలంటూ ఓవ్యక్తి ఆర్‌జీఏ పేరుతో జూలైలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించాడు. అనంతరం అవగాహన సదస్సులు పెడుతూ వచ్చిన బాధితుల నుంచి రూ.1,800 కట్టించుకోవడమే కాకుండా వారు మరికొంత మందితో డబ్బులు కట్టించేలా జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తులు మధ్యవర్తులుగా నియమించుకున్నాడు. వీరి ద్వారా ఈ సంస్థల్లో రూ. 1,800 కట్టి సభ్యత్వం తీసుకుంటే యాప్ ఇచ్చి ప్రతిరోజు4 నుంచి 5 యాడ్‌లను పంపిస్తూ వాటిని చూసిన వారికి ప్రతి రోజు రూ.60లను యాప్‌లో జమ చేస్తుంటారు. ఇలా రూ. 1,800లు కడితే రోజుకు రూ.60, రూ. 4, 500 కడితే రూ.260, అలాగే రూ. 15 వేలు కడితే రూ.540, అదేవిధంగా రూ.45 వేలు కడితే 1,620, లక్ష 20వేలు కడితే రూ.4,650, ప్రతి రోజు వస్తుంటాయి. ఇవేకాకుండా ఒకవ్యక్తి కింద రూ.400 మంది సభ్యులు చేరితే వారికి లక్షరూపాయల వేతనంతో పాటు వారు సమావేశాన్ని పెట్టుకునేందుకు అయ్యే ఖర్చును ఇస్తూ వచ్చారు. ఇలా జమ అయిన డబ్బు వారంలో ఒక రోజు ప్రతి మంగళవారం విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించగా మంగళవారం విత్‌డ్రా కనిపించక పోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సంస్థ ఎత్తేశారని తెలియడంతో కొందరు తమ బంధువులు తెలిసిన వారి వద్దకి డబ్బులు మాది గ్యారెంటీ అంటూ ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చి లక్షల్లో మోసపోయినట్లు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 50వేల మంది ఉన్న ఆర్‌జీఏ బాధి తులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఈవిషయమై సదరు మోటివేటర్‌ను బాధితులు నిల దీయగా తాము కూడా మోసపోయామని చెప్పుకొచ్చారు. ఆర్‌జీఏ బాధితులు ఉమ్మడి నల్లగొండ వ్యాప్తంగా సూర్యాపేట పోలీస్ స్టేషన్‌కు వస్తున్నారు. పోలీసులు సదరు మధ్యవర్తిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తున్నట్లు తెలిసింది.

పెట్రోల్ బంక్‌లో గొడవ.. ఇరువురిపై కేసు


బంక్ తనిఖీ చేస్తున్న పి.రామకృష్ణ

కట్టంగూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పామనగుండ్ల గ్రామం 65వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆర్‌పీ పెట్రోల్ బంక్‌లో జరిగిన గొడవపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. నార్కట్‌పల్లి మండలం తొండ్లాయికి చెందిన కారు యజమాని శరత్ కుమార్ ఈనెల 23న తన కారులో పెట్రోల్‌ను ఫుల్ ట్యాంక్ చేయమని సిబ్బందికి చెప్పారు. దాంతో బంక్ సిబ్బంది కార ులో 42లీటర్ల పెట్రోల్ కొట్టి డబ్బులు అడగగా కారు ట్యాంక్ కెపాసిటీ 35 లీటర్లని 42 లీటర్లు ఎలా పడు తుందని గొడవకు దిగాడు. ఈ నేపథ్యంలో బూతులు తిట్టి దౌర్జన్య చేశారని బంక్ సూపర్ వైజర్ గుడుగుంట్ల జానయ్య ఫిర్యాదు మేరకు కారు యజమాని శరత్‌కుమార్‌తో పాటు అతడి వెంట ఉన్న మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కారు కెపాసిటి 35 లీటర్లు ఉండగా బంక్ సిబ్బంది 42 లీటర్లు పెట్రోల్ కొట్టామని చెప్పి తన నుంచి దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేశారని దుర్భాషలాడి వేధించారని శరత్ కుమార్ ఆన్‌లైన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు బంక్ యజమాని వివేక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పామనగుండ్ల పెట్రోల్ బంక్ తనిఖీ

మండలంలోని పామనగుండ్ల గ్రామంలో గల ఆర్‌పీ పెట్రోల్ బంక్‌యాజమాన్యం కొలతల్లో మోసానికి పాల్పడుతున్న ఆరోపణ రావడంతో జిల్లా తూనికల కొలతల అధికారి పి.రామకృష్ణ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంక్‌లో ఉన్న పంపుల డెలివరీ తనిఖీ చేయగా అంతా సక్రమంగా ఉందని తేలినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీటీ రాచకొండ జ్యోతి ఉన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

- కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు
- బాలసదనానికి బాలిక తరలింపు

తుర్కపల్లి,అక్టోబరు24,(ఆంధ్ర జ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం ఓ గిరిజనతండాలో గురువారం ఉదయం జరుగాల్సిన బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని ఓ గిరిజన తండాకు చెందిన 16 ఏళ్ల మైనర్‌ను బొమ్మలరామారం మండలం గోవింద్ తండాకు చెందిన వ్యక్తితో వివాహం చేసేందుకు 20 రోజుల క్రితం వారి ఇరువురి కుటుంబ సభ్యులు నిశ్చయించారు. ఈ క్రమంలో 24న (గురువారం) వివాహం చేసేందుకు అన్నిఏర్పాట్లు చేసుకున్నారు. అయితే మైనర్‌కు వివాహం చేస్తున్నారనే పక్కా సమాచారంతో ఈ నెల 23న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం అధికారులు తండాను సందర్శించి బాలిక తల్లిదండ్రులు, బంధువులతో కౌన్సెలింగ్‌నిర్వహించారు. బాల్యవివాహం చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అమ్మాయి వయస్సును నిర్ధారించడానికి కావాల్సిన సర్టిఫికెట్లతో పాటు అబ్బాయి బంధువులను తీసుకొని భువనగిరి సీడబ్ల్యూసీ కార్యాలయానికి రావాలని చెప్పి వెళ్లారు. వారు వెళ్లగా బాలికకు సంబంధించిన అంగన్‌వాడీ టీచర్లు సర్వే రికార్డు, పాఠశాల రికార్డులను అధికారులు పరిశీలించి మైనర్‌గా నిర్ధారించారు. అనం తరం బాల్యవివాహాల వచ్చే అనార్థాలపై అవగాహన కల్పించారు. బాలికను బాల సదన్‌కు తరలించారు. ఈ నెల 27 మరోసారి బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తామని అధికారులు తెలిపారు. వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యురాలు జయశ్రీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం అధికారులు సైదులు, మహిపాల్, విజయరాణి ఉన్నారు.

కేతేపల్లి వాసికి జాతీయ ఉత్తమ రైతు పురస్కారం



ప్రశంసా పత్రం అందుకుంటున్న షేక్ సయ్యద్ అలీ

కేతేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్న కేతేపల్లి మండలంలోని కాసనగోడు గ్రామానికి చెందిన యువ రైతు షేక్ సయ్యద్ అలీ ఉత్తమ రైతు పురస్కారాన్ని అందుకున్నారు. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో వెదజల్లే విధానం, డ్రమ్ సీడర్, మెట్ట వరి సాగు చేయడంతో పాటు పరిసర గ్రామాల రైతులను ఆ దిశగా సయ్యద్ అలీ ప్రోత్సహిస్తుంటాడు. ఈ క్రమంలో రైతు దినోత్సవం సందర్భంగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఆర్ఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్ రాజేంద్రనగర్ లో భారతీయ వరి పరిశోధనా సంస్థ గురువా రం నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ అగ్రి కల్చర్ అండ్ ఫార్మర్ వేల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి ఎన్‌జీ.రంగా యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్‌కె.మీరాఅతార్ని బాషాను సత్కరించి ప్రశం సాపత్రాన్ని అందజేశారు. ఉత్తమ రైతు పురస్కారాన్ని అందుకున్న సయ్యద్ అలీని కాసనగోడు గ్రామస్తులు అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భువనగిరిరూరల్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన కొండాపురం సూరయ్య ఈనెల 20 న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఆయన కుమారుడు బాలరాజు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం సూరయ్య ఇంటి పక్కనే ఉన్న సమీప బంధువు పార్వ తమ్మ ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని బాలయ్యకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే వారు ఇంటికి రాగా ఇంటి తలుపులు, బీరువా తాళం తెరిచిఉన్నాయి.ఇంట్లో ఉంచిన దాదాపు 13 తులాల బంగారు ఆభరణాలు, దాదాపు 51 తులాల వెండి ఆభరణాలు, రూ.19వేల నగదు ఎత్తుకెళ్లారు. సూరయ్య కుమారుడు బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో డీసీఎం డ్రైవర్ ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో డీసీఎం డ్రైవర్ ఫ్యాన్‌కు ఉరేసుకుని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన చక్కరాజు(38) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తూ మండలంలోని దండుమల్కాపురంలో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవ్వరూ లేని సమయం లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుసీఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

తుర్కపల్లి, అక్టోబరు 24 : బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీ కొట్టడంతో యువకుడి మృతి చెందాడు.ఈ ఘటన తుర్కపల్లి-కుషాయగూడ ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మాదాపూర్ గ్రా మ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన సొన్నాయిల మహేశ్(27) రాత్రి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మాదాపూర్ గ్రామ సమీపంలో బైక్ రోడ్డు కల్వర్ట్‌ను ఢీ కొట్టడంతో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ తక్యుద్దీన్ మృత దేహాన్ని శవాన్ని భువనగిరి ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం గొప్పది :డీఎస్పీ

దేవరకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అన్నారు. గురువారం దేవరకొండ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సకాలంలో రక్తం అందుబాటులో లేక రోడ్డు ప్రమాదంలో గాయపడినవారు, గర్భిణులు మృతి చెందుతున్నారని ఆయన తెలిపారు. దేవరకొండ లయన్స్‌క్లబ్ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

జమ్మనకోటతండాలో 300 కిలోల నల్లబెల్లం పట్టివేత

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం తనిఖీ చేపట్టి రూ.3లక్షల విలువైన నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాలో నల్లబెల్లాన్ని నిల్వ ఉంచారనే సమాచారంతో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ బాలరాజు, హాలియా ఎక్సైజ్ పోలీసులతో కలిసి తండాకు చేరుకొని నిల్వ ఉంచిన గోదాంపై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ తనిఖీలో 300 కిలోల నల్లబెల్లం, 50 కిలోల ఆలం, 10 లీటర్ల నాటుసారా పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన కృష్ణానాయక్ సారా తయారీ కోసం అక్రమంగా బెల్లం దాచి ఉంచినట్లు తెలిసింది. తనిఖీల్లో హాలియా ఎక్సైజ్ సీఐ కల్పన, ఎస్ఐ సంపత్‌ల పాల్గొన్నారు.

CLASSIFIEDS

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వధువు కావలెను

★ ఆర్యవైశ్య అమ్మాయి కావలెను, 1, 2, ఆర్యవైశ్య అబ్బాయి 36, M.Ed., ప్రైవేట్ లెక్చరర్ 20+20=40 వేలు, ఆస్తి 1 కోటి, M9HB, మునుగోడు రోడ్డు, నల్లగొండ. సెల్: 9121325068.

AJY_161976

4 Lines CLASSIFIED
NLG+SRPT+YGT (3Dist)
210/-Only
Extra Line 45/- Only
For Ads Contact :
NALGONDA DIST 9985413365 9985413656
SURYAPET DIST 9703618713, 9985401015
YADADRI BHONGIRI DIST 9985410384

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నార్కట్‌పల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వారం రోజులు గడుస్తున్నా ఎక్కడా కొనుగోళ్లు ప్రారంభించలేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. మండలకేంద్రంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఆర్భాటంగా ఐకేపీ, సీసీఐ కేంద్రాలను ప్రారంభించి చేతులు దులుపుకుందన్నారు. ఆయా కేంద్రాల్లో వరి, పత్తి పంట కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు తక్కువ ధరకు దళారులకు పంటను అమ్ముకుంటున్నారని తెలిపారు. కొనుగోళ్లు లేక అకాల వర్షాలకు వరి ధాన్యం, పత్తి తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే ఐకేపీ, సీసీఐ కేంద్రాల్లో కాంటాలు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

'బీసీ ఉన్నతాధికారులపై వివక్ష తగదు : జాజుల

మిర్యాలగూడ టౌన్, మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బీసీ ఉన్నతాధికారులపై వివక్ష తగదని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు బడుగు, బలహీనవర్గాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను వేధింపులకు గురి చేస్తున్నాయన్నారు. నిబద్ధత కలిగిన అధికారులకు పోస్టింగ్ కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వకుండా లూప్‌లైన్ పోస్టులో ఉంచుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నేతలు బంటు వెంకటేశ్వర్లు శేఖర్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి కన్నెర్ర

- వర్షాలతో అన్నదాత అతలాకుతలం
- ఈదురుగాలులతో నేలకొరిగిన పొలాలు
- వందల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు



ముకుందాపురంలో నేలకొరిగిన వరి పొలం

నిడమనూరు, మాడ్గులపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేశాయి. లక్షల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ఆరుగాలం శ్రమించి, ఎన్నో వ్యయప్రయాసల కోర్చి అన్నదాతలు పంటలు సాగు చేశారు. అనేక ఆటుపోట్లను తట్టుకొని పంటలు కాపాడుకున్నారు. పండించిన పంటలు కోత దశలో ఉన్నాయి. మరో రెండు వారాల్లో పంటలు చేతికొస్తాయని భావిస్తున్న తరుణంలో ప్రకృతి కన్నెర్ర చేసింది. అకాల వర్షాలతో అనేక గ్రామా ల్లో వరి పొలాలు నేలకొరిగాయి. దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా వివిధ గ్రామాల్లో పంటలు నేలకొరగడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. మండలంలో వానాకాలం సీజన్‌లో మునుపెన్నడూ లేని విధంగా 35 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. సాగు చేసిన పంటలు నాన్ ఆయకట్టు గ్రామాల్లో ఇప్పుడిప్పుడే కోతలు మొదలవగా, ఆయకట్టు గ్రామాల్లో మాత్రం కోత దశలో ఉన్నాయి. పది రోజుల్లో పంటలు చేతికి అందే అవకాశం ఉంది. కానీ రైతులు భయపడుతున్న మాదిరిగానే అకాల వర్షం వారి ఆశలపై నీళ్లు చల్లింది. మండలంలోని ముకుందాపురం, గుంటిపల్లి, బొక్కమంతలపహాడ్ తదితర గ్రామాల్లో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ఒక్క ముకుందాపురం గ్రామంలోనే 50 ఎకరాలకు పైగా వరి పంట నేలకొరిగిందని రైతులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన సలికంటి సత్యమయ్య, కత్తి కృష్ణారెడ్డి, పాలోజు సుదర్శనాచారి, కుందనపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సలికంటి శ్రీనయ్య, బొడ్డుపల్లి ఎల్లయ్య, షేక్ అక్బర్, గుంటిపల్లి గ్రామంలో రాపర్తి సత్యనారాయణ తదితర రైతులకు చెందిన వరి పొలాలు నేలకొరిగాయి. మండలంలో 550 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ అధికారులు అంచనా వేసినప్పటికీ వెయ్యి ఎకరాలకు పైగానే పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. పంటలు చేతికి అందనున్న ఈ దశలో అకాలంగా వర్షం కురవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ప్రతీ సీజన్‌లో పంటలు కోత దశలో ఉండగా అకాలంగా వర్షాలు కురిసి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

అకాల వర్షం - అపార నష్టం

మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెం, పోరెడ్డిగూడెం, ఆగామోత్కూర్, పాములపాడు, చిరుమర్తి, చర్లగూడెం, మాడ్గులపల్లి కొత్తగూడెం తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వరి పొలాలు నేలకొరిగాయి. మండలంలోని రైతులు 32వేల ఎకరాల్లో వరి, 9,900 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. రాత్రి కురిసిన వర్షానికి 450 ఎకరాల్లో పంట నేలవాలినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. రైతులు అకాల వర్షం కురవడంతో పెట్టిన పెట్టుబడి వస్తుందో లేదోనన్న ఆందోళనలో ఉన్నారు. బుధవారం దెబ్బతిన్న పొలాలను మండల వ్యవసాయ అధికారి శివకుమార్ పరిశీలించారు. ఆయన వెంట ఏఈవోలు ఉన్నారు.

ఐదెకరాల పొలం దెబ్బతిన్నది



వానాకాలం సీజన్‌లో నాకున్న పొలంతో పాటు కొంత కౌలుకు తీసుకొని 8 ఎకరాలు సాగు చేశాను. పంటల కోసం వేల రూపాయల పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. మరో రెండు వారాల్లో పొలాలు కోద్దామనుకున్నాను. కానీ ఇంతలోనే అకాల వర్షం కురవడంతో ఐదెకరాల పొలం దెబ్బతిని పూర్తిగా నేలకొరిగింది. పంటలు నష్టపోతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలి.

- సలికంటి సత్యం, ముకుందాపురం

27న మూసీ పరివాహక రైతుల ఆత్మీయ సమ్మేళనం

శాలిగౌరారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మూసీ పరివాహక రైతులు భవిష్యత్తు కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి కోరారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 11గంటలకు అడ్డగూడూరు మండలం మానాయికుంటలో ఎమ్మెల్యే మందుల సామేలు అధ్యక్షతన నియోజకవర్గస్థాయి మూసీ పరివాహక రైతులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనానికి మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సమరంరెడ్డి కోరారు.

నేడు మీట్ యువర్ ఎస్పీ

చింతపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాధితుల యొక్క ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర న్యాయం చేసేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించే కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

డిండి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో నైట్ వాచ్‌మన్‌గా పనిచేసేందుకు అర్హులైన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో గోప్యానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను డిండి మానవ వనరుల కేంద్రంలో ఈ నెల 29వ వరకు అందజేయాలని కోరారు.



డిప్యూటీ ముఖ్యమంత్రిలో కలిసిన కాంగ్రెస్ నాయకుడు వట్టికోటి శేఖర్

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో సుబ్రహ్మణ్యం

చండూరు, గట్టుప్పల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 24: రైతులు కష్టపడి పండించిన పంటను దళారుల చేతుల్లో పెట్టి మోసపోవద్దని చండూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యం, గట్టుప్పల్ తహసీల్దార్ రాములు అన్నారు. చండూరు పట్టణంతో, గట్టుప్పల్ మండలంలోని తేరట్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయించవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు నేరుగా ధాన్యాన్ని తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. రైతులను మోసగిస్తే దళారులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ కోడి సుష్మ, తహసీల్దార్ దశరథ, ఎంపీడీవో రాంరెడ్డి, ఏవో రేవతి, మునిసిపల్ కౌన్సిలర్ కోడి వెంకన్న, డైరెక్టర్లు కట్ట బిక్షం, మిట్టపల్లి రాజు, గిరి సత్తయ్య, రాములు, ఆంజనేయులు, గట్టుప్పల్‌లో పీఏసీఎస్ చైర్మన్ కోడి సుష్మ, మాజీ ఎంపీటీసీ గొరిగి సత్తయ్య, డైరెక్టర్లు అచ్చం శ్రీనివాస్, ఆంజనేయులు, సెక్రటరీ షఫీ, రైతులు పాల్గొన్నారు.

డ్వాబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు

- ఏఐసీబీ ఉపాధ్యక్షుడు చొక్కారావు



సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

నల్లగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్వాబ్ ఆధ్వర్యంలో అంధుల సంక్షేమం, అభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి, ఏఐసీబీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కారావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాలుగా తమ సంస్థ చేస్తున్న అభివృద్ధి సంక్షేమం గురించి మీడియా ఎంతగానో ప్రచారం కల్పించడం సంతోషకరమన్నారు. అంధుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. డ్వాబ్‌తో పాటు ఏఐసీబీ జాతీయ స్థాయిలో అంధుల అభివృద్ధి కోసం కృషి చేయడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి పరమేష్, అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని విమర్శిస్తే సహించం

- కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక
- పలుచోట్ల గాదరి దిష్టిబొమ్మ దహనం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

నల్లగొండ, శాలిగౌరారం, కనగల్, నకిరేకల్, మాడ్గులపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని స్థాయిని మరిచి విమర్శిస్తే సహించేది లేదని, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ నోరు అదుపులో పెట్టుకోవాలని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 25 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, మంత్రిగా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి కోమటిరెడ్డిపై స్థాయిని మరిచి విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిన తర్వాత ఆ పార్టీ మాజీ నాయకులు మతిస్థిమితం కోల్పోయి సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా దోచుకొని దాచుకున్నారని విమర్శించారు. అధికారంలో కోల్పోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలు ప్రాజెక్టుల పేరిట కోట్లను దోచుకున్నారన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డిపై ఇప్పటికైనా అసత్య ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు మానుకోవాలన్నారు. మంత్రిపై మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని, భాష మార్చుకోకపోతే వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేసిన కిషోర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కత్తుల కోటి, బొజ్జ శంకర్, జూలకంటి శ్రీనివాస్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, బుర్రి యాదయ్య, ఏర్పుల రవి, సైదిరెడ్డి, అంజి, నాగరాజు, కార్తీక్, అనిల్, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

- శాలిగౌరారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కిషోర్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, గూని వెంకటయ్య, ఇంతియాజ్, దండ అశోక్‌రెడ్డి, జనార్దన్, ధనుంజయ్ పరమేష్ పాల్గొన్నారు.
- కనగల్ మండలకేంద్రంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కిషోర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్య క్రమంలో పందుల రాజు, నాయకులు పొట్టిపాక మహేందర్, నామ అశోక్, కిన్నెరస్వామి, సైదు లు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి డిమాండ్ చేశారు.
- నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కిషోర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, వారికి బేషరతుగా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జి.రవీందర్‌రెడ్డి, యాసుఫ్, రాజశేఖర్, నక్షిత్, మహేష్, సతీష్ పాల్గొన్నారు.
- మంత్రి వెంకట్‌రెడ్డికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గణపురెడ్డి భిక్షంరెడ్డి, శానాల యుగేందర్‌రెడ్డి, యానాల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెప్పారని, అధికారంలో ఉన్నప్పుడు ఇసుకదందా, కాంగ్రెస్ నాయకులపై దాడులు చేయించిన చరిత్ర కిషోర్‌దని వారు పేర్కొన్నారు.
- మాడ్గులపల్లిలో మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు మాట్లాడుతూ నల్లగొండ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కిశోర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకన్న, నరేష్, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

మునుగోడు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల సమగ్ర అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వట్టికోటి శేఖర్, జంగిలి నాగరాజు డిప్యూటీ సీఎం ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కను కోరారు. గురువారం డిప్యూటీ సీఎంను ప్రజాభవన్‌లో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలి

చందంపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ కోరారు. గురువారం మండలంలోని తెల్‌దేవరపల్లిలో ఇంటింటికి తిరిగి బీజేపీ సభ్యత్వాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు నక్క వెంకటేష్‌యాదవ్, అంజినాయక్, వెంకట్, వినోదచారి, వెంకటయ్య, రవి, శివ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు చీరల పంపిణీ

హాలియా, అక్టోబరు 24: హాలియా మునిసిపాలిటీ మహిళా పారిశుధ్య కార్మికులకు దీపావళి సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాకునూరి నారాయణగౌడ్ తన సొంత నిధులతో చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు నారాయణగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గౌరవసలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సలహాదారులు పిల్లి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు గౌని రాజారమేష్‌యాదవ్, తక్కెళ్లపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

పశుగణనకు పాడి రైతులు సహకరించాలి : సునీత

చండూరురూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పశుగణనకు పాడి రైతులు సహకరించాలని మండల పశువైద్యాధికారి సునీత కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో పశుగణన కార్యక్రమాన్ని ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులకు పాడి రైతులు సమగ్ర సమాచారం ఇవ్వాలన్నారు.

మూసీ ప్రక్షాళన చేయాలి

చిట్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళన చేసి నదీ జలాలను కాపాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ కోరారు. గురువారం చిట్యాలలో జరిగిన సీపీఐ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ ప్రక్షాళన చేస్తే నకిరేకల్ నియోజకవర్గంలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. చెరువులు, కుంటలు ఆక్రమించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండీ అక్బర్, నాయకులు బొడిగె సైదులు, జిల్లా సత్యం, బొల్లూరి లింగయ్య, దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, రావుల చినవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయల కల్పనకు కృషి : రజిత

నకిరేకల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితశ్రీనివాస్ అన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో గురువారం ఆమె పర్యటించారు. స్థానిక మహిళలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వీరేశం సహాయ సహకారాలతో మునిసిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. సమావేశంలో మునిసిపల్ కౌన్సిలర్ యాసారపు లక్ష్మీవెంకన్న, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

అనధికారిక క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్లు

నల్లగొండటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా ఫిజియోథెరపిస్టులుగా కొనసాగుతూ క్లినిక్‌లను నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిజియోథెరపీ అసోసియేషన్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా ఫిజియోథెరపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్లు కలెక్టర్ నారాయణరెడ్డి, డీఎంహెచ్‌వో శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కొందరు ఫిజియోథెపిస్టులమని క్లినిక్‌లను నిర్వహించడమే కాకుండా విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సైతం హోం విజిట్ చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే వారిపై చర్యలు తీసకోవాలని కోరారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో శ్రీనివాస్ స్పందిస్తూ అనర్హులపై తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫిజియోథెరపీ అసోసియేషన్ సభ్యు లు సైదయ్య, యాదయ్య, నాగరాజు, వంశీవర్ధన్, సత్యవాణి, అనూష, శ్రీవాణి, ప్రి యాంక, విజయరామకృష్ణ, ప్రఖ్యాత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం



నీలమ్మ (ఫైల్)

నకిరేకల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పత్తి కూలీకి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న మహిళా కూలీలను ట్యాంకరు ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి తీ వ్ర గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం నకిరేకల్ శివారులోని చందంపల్లి స్టేజీ వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగింది. నకిరేకల్ ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నకిరేకల్‌లోని పన్నాలగూడెంకు చెందిన లింగంపల్లి నీలమ్మ (42), ఎదుల్ల జ్యోతి, జి.భాగ్యమ్మ పత్తి వేరేందుకు నకిరేకల్ శివారులోని చందంపల్లి సమీపంలోని పత్తి చేనుకు వెళ్లారు. పత్తి ఏరిన తర్వాత సాయంత్రం తిరుగు పయమయ్యారు. నకిరేకల్‌కు నడుచుకుంటూ వస్తున్నారు. డివైడర్ దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న గుర్తు తెలియ ని ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నీలమ్మ దుర్మరణం చెందగా ఏదుళ్ల జ్యోతి, భాగ్యమ్మకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన వవారిని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మండలంలోని కడపర్తి గ్రామానికి చెందిన నీలమ్మ భర్త సోమయ్య కొంత కాలంగా పన్నాలగూడెంలోని గాలి మిషన్ నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

యాసంగికి ముందస్తు ప్రణాళిక

(5వ పేజీ తరువాయి)

యూరియా 71,066 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, ఇప్పటికే 24వేల మెట్రిక్‌టన్నుల యూరియా నిల్వ ఉంది. అందులో దుకాణాల్లో 7వేల మెట్రిక్ టన్నులు ఉండగా, గోదాముల్లో 17వేల మెట్రిక్ టన్నుల నిల్వ ఉంది. డీఏపీ 17,917 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 14,078 మెట్రిక్‌టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 44,303 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 7,167మెట్రిక్ టన్నులు అవసరం.

ఆం: ఈ సీజన్‌లో వరి ఏ రకం ఎక్కువగా సాగయ్యే అవకాశాలు ఉన్నాయి?

జేడీఏ: రైతులు దొడ్డు రకంతో పాటు సన్న రకం ధాన్యం సాగు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం సన్నరకం వరిని సాగు చేస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నందున ఈ రకం సాగుకు రైతులు మొగ్గుచూపే అవకాశం ఉంది. వేరుశనగ అత్యధికంగా దేవరకొండ డివిజన్‌లో సాగవనుంది.

ఆం: ఎరువులు, విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి?

జేడీఏ: ప్రభుత్వం అనుమతి ఇచ్చిన దుకాణాల్లో మాత్రమే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. దళారులను నమ్మి విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దు. ఏ కొనుగోలు అయినా రశీదు తీసుకొని సీజన్ పూర్తయ్యే వరకు దగ్గర ఉంచుకోవాలి. విత్తనం, లేదా ఎరువు తయారు తేదీ, మన్నిక గడువును జాగ్రత్తగా చేసుకోవాలి.

ఆం: నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులపై నిఘా ఎలా ఉండనుంది?

జేడీఏ: నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులపై వ్యవసాయశాఖ పటిష్ఠ నిఘా ఉంటుంది. ఇటీవల మిర్యాలగూడలో చెస్ కంపెనీకి సంబంధించిన నకిలీ మందులను గుంటూరు జిల్లా నుంచి దామరచర్ల మీదుగా చేర్చడంతో గుర్తించి ఐదుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం. నకిలీ మందులు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అదేవిధగా ఎరువుల అందుబాటుపై ప్రతీ వారంలో ఐదు రోజుల పాటు ఫైవ్ (ఫర్టిలైజర్ ఇన్‌వెండరీ వెరిఫికేషన్ సిస్టం) యాప్ ద్వారా నిల్వల గురించి నమోదు చేయిస్తాం. దుకాణాల్లో నూటికి నూరు శాతం తనిఖీ చేసి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాం.

కేంద్రప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



జీచెన్నారంలో సభ్యత్వ నమోదు అందజేస్తున్న నాయకులు

నల్లగొండరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. బీజేపీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లగొండ మండలంలోని జిచెన్నారం, కొత్తపల్లి గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాల ప్రజలు అభివృద్ధికి ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సభ్యత్వ ఇన్‌చార్జి పోతేపాక సాంబయ్య, నాయకులు పోతేపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, బోగరి అనిల్‌కుమార్, కొత్తపల్లి ప్రమోద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

గట్టుప్పల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మతోన్మాదం పెరిగిపోతుందని, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం నేటి యువత ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉన్న చర్లగూడెం, కిష్టరాయిన్‌పల్లి రిజర్వాయర్లకు అధిక నిధులు కేటాయించి డీపీఆర్ ఆమోదం తెలపాలని సూచించారు. సీపీఎం మండల నాయకుడు చాపల మారయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహా, నాయకులు నాంపల్లి చంద్రమౌళి, కర్నాటి మల్లేశం, ఏర్పుల యాదయ్య, ధనుంజయ, శివకుమార్, సుధాకర్, శ్రీను, శ్రీనివాస్, శ్రీశైలం, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ మేడం రూటే సప'రేటు'

(5వ పేజీ తరువాయి)



బైక్‌పై పహాణీలను తీసుకెళ్తున్న ప్రైవేటు వ్యక్తులు

ఉంది. ప్రైవేట్ వ్యక్తులు ఏ సెక్షన్లలోనైనా సరే ఉద్యోగులతో సమానంగా కుర్చీల్లో తిష్టవేసి ఫైళ్లను లెక్కిస్తున్నారు. రికార్డుగదిలో వీరి హవా మితిమీరింది. మేడం అండదండతో ఖసరా పహాణీ, పహాణీలను బయటకు తెచ్చి జిరాక్స్ తీయిస్తున్నారు. దీంతో ఆ విభాగం అధికారి సేవలు నామమాత్రంగానే మిగిలిపోతున్నాయి.

విద్యార్థులకు తప్పని ప్రదక్షిణలు

విద్యాసంవత్సరానికి అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాలు పొందేందుకు విద్యార్థులు రోజులు తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. మీ-సేవలో వివరాలు అప్‌లోడ్ చేశాక, దరఖాస్తులను పరిశీలించి ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉండా, తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. డిజిటల్ సంతకం చేయాలన్నా.. ముద్ర పడాలన్నా.. పచ్చ నోటు ఇచ్చుకోవాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులు, చోటామోటా లీడర్లకు పనులు జరుగుతున్న నేపథ్యంలో సదరు అధికారితీరుపై నోరు మెదపడం లేదని సామాన్య ప్రజలు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలంలో యథేచ్ఛగా సాగుతున్న చేతివాటంపై విచారణ జరిపి శాఖాపర చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.